బాలల కమిషన్‌లో కాంగ్రెస్ పెద్దలు!

- పదవులన్నీ అధికార పార్టీ నేతలకే
- నిబంధనలకు పాతర.. పదవుల జాతర
- చైర్‌పర్సన్‌గా ఓ మాజీ ఎమ్మెల్యే నియామకం
- అర్ధరాత్రి జీవో.. తెల్లవారే ప్రమాణస్వీకారం

హైదరాబాద్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ): తెలంగాణ బాలల హక్కుల కమిషన్ రాజకీయ నిరుద్యోగులకు వేదికగా మారిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మూడు రంగుల కండువా కప్పుకున్న వారికే కమిషన్ పదవుల్లో ప్రభుత్వం పెద్దపీట వేసిందన్న ఆరోపణలు వస్తున్నాయి. చైర్‌పర్సన్ సహా ఇతర పదవుల్లో అధికార పార్టీకి చెందిన వారికే చోటు లభించిందని అంటున్నారు. నిబంధనలకు నీళ్లు వదిలి, న్యాయస్థానాల ఆదేశాలకు విరుద్ధంగా దొడ్డిదారిలో పదవుల పందేరం జరిగినట్టు తెలుస్తున్నది. అర్హత లేని వారిని అందలమెక్కించడంపై సామాజిక వేత్తలు, ప్రజాసంఘాల నుంచి తీవ్ర అభ్యంతరం వ్యక్తమవుతుండగా అధికార పార్టీ నుంచి కూడా భిన్నస్వరాలు వినిపించడం కొసమెరుపు.

అర్హతలేని వారికి ప్రాధాన్యం

చైల్డ్‌రైట్స్ వెల్ఫేర్ కమిషన్ చైర్‌పర్సన్, ఇతర సభ్యుల నియామకంలో ప్రభుత్వంలో అత్యంత కీలక స్థానంలో ఉన్న ఓ అగ్రనేత చక్రం తిప్పి పై'చేయి' సాధించినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిబంధనలు తోసిరాజని అనేకమంది ముఖ్యనేతలు, మంత్రుల అభ్యంతరాలను పక్కనబెట్టి పట్టుబట్టి ఆయన తన పంతం నెగ్గించుకున్నట్టు తెలుస్తున్నది. ఉమ్మడి రాష్ట్రంలో పూర్వాశ్రమంలోని పార్టీలో తనతో కలిసి పనిచేసిన నాయకురాలు, దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే కొత్త కోట సీతా దయాకర్‌రెడ్డిని చైర్‌పర్సన్‌గా నియమించారు. ఆమె అధికార పార్టీలో చేరిన సమయంలో ఇచ్చిన హామీ మేరకే ఈ బాధ్యతలు అప్పగించినట్టు సమాచారం. పార్టీలో తనకు అత్యంత ఆప్తుడు, కీలక పదవిలో ఉన్న నాయకుడి సమీప బంధువుకు కమిషన్ పాలకవర్గంలో చోటు కల్పించారు. అలాగే కాంగ్రెస్ ఎస్సీ సెల్ వైస్ చైర్మన్‌గా పనిచేసిన వ్యక్తితో పాటు రిటైర్డ్ పోలీసు అధికారి భార్య, నాన్‌లోకల్ వ్యక్తికి సైతం అవకాశం ఇచ్చారు.

అర్ధరాత్రి రహస్యంగా జీవో

చైల్డ్‌రైట్స్ వెల్ఫేర్ కమిషన్ చైర్‌పర్సన్, ఆరుగురు సభ్యులను నియమిస్తూ ప్రభుత్వం గురువారం అర్ధరాత్రి ఉత్తర్వులు జారీచేసింది. పదవి కోసం దరఖాస్తు చేసుకున్న ఆశావాహులు, స్వచ్ఛందసంస్థల బాధ్యులు న్యాయస్థానాలను ఆశ్రయించకుండా రాత్రిరాత్రే రహస్యంగా జీవో ఆర్టీ నంబర్ 45ని విడుదల చేసిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక తెల్లవారగానే శుక్రవారం ఉదయమే హడావుడిగా చైర్‌పర్సన్‌గా నియామకమైన సీతా దయాకర్‌రెడ్డితోపాటు సభ్యులు కంచెర్ల వందనాగౌడ్, మరిపల్లి చందన, బీ అపర్ణ, గోగుల సరిత, ప్రేమలత అగర్వాల్, బీ వచన్‌కుమార్‌తో ప్రమాణం స్వీకారం చేయించి బాధ్యతలు అప్పగించారు. న్యాయస్థానంలో ప్రభుత్వానికి చుక్కెదురు తప్పదనే భావనతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తున్నది.

నిబంధనలకు పాతర..

బాలల కమిషన్ చైర్‌పర్సన్, సభ్యుల నియామకంలో ప్రభుత్వం నిబంధనలను నిట్టనిలువునా పాతరేసింది. చట్టం ప్రకారం కనీసం ఏడేండ్లు సమాజాభివృద్ధి, బాలల అభ్యున్నతికి కృషిచేసి, 35 ఏండ్లు నిండిన వ్యక్తులను కమిషన్ పదవుల్లో నియమించాలి. దీనిపై గతంలో కోర్టులు సైతం స్పష్టమైన ఆదేశాలు జారీచేశాయి. కానీ కాంగ్రెస్ సర్కారు ఇందుకు విరుద్ధంగా సామాజిక సేవతో సంబంధంలేని వారికే బాధ్యతలు అప్పగించిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఒకరిద్దరు సభ్యులు మినహాయించి మిగిలిన వారంతా రాజకీయ పార్టీలకు చెందిన వారే కావడం గమనార్హం. బాలబాలికలకు సేవ లందించడంలో కీలకంగా వ్యవహరించే చైల్డ్ రైట్స్ కమిషన్ చైర్‌పర్సన్ బాధ్యతలను ఫక్తు రాజకీయ నేతకు ఇవ్వడంలోని మతలబేంటని సామాజికవేత్తలు ప్రశ్నిస్తున్నారు.

రాష్ట్రంలో రాజకీయ దుమారం..

బాలల హక్కుల పరిరక్షణలో ఎంతో కీలకమైన కమిషన్‌లో నియమించిన సభ్యుల విషయంలో పలువైపుల నుంచి విమర్శలు వ్యక్తమవుతుండగా, అధికార పార్టీలోనూ వ్యతిరేకత వ్యక్తం కావడం గమనార్హం. చైర్‌పర్సన్‌గా సీతా దయాకర్‌రెడ్డి విషయంలో పార్టీ అగ్రనేతలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్టు తెలిసింది. కొంత కాలం కిందటే పార్టీలో చేరి, పార్టీ కోసం ఏమీ చేయని వ్యక్తికి ఇంతటి ముఖ్యమైన బాధ్యతలు ఎలా అప్పగించారని ప్రశ్నిస్తున్నట్టు సమాచారం.

బెట్టింగ్ ముఠా వివరాలు వెల్లడిస్తున్న నిజామాబాద్ సీపీ సాయిచైతన్య

బెట్టింగ్ ముఠాల ఆటకట్టు

- రెండు ముఠాలకు చెందిన ఏడుగురు అరెస్టు
- పరారీలో మరో తొమ్మిది మంది
- 34 బైక్‌లు, రూ.56 వేల నగదు స్వాధీనం

వినాయక్‌నగర్, ఏప్రిల్ 4:నిజామాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న రెండు అంతర్రాష్ట్ర ముఠాల సభ్యులనుపోలీసులు అరెస్టు చేసి, 34 ద్విచక్రవాహనాలు, రూ.56 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న తొమ్మిది మంది కోసం గాలిస్తున్నారు. నిజామాబాద్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీపీ సాయిచైతన్య వివరాలను వెల్లడించారు. నిజామాబాద్‌లో బెట్టింగ్ నిర్వహిస్తున్నట్టు పక్కాగా సమాచారం అందడంతో ప్రత్యేక బృందాలు దాడి చేసి ముఠా సభ్యులను పట్టుకున్నాయని చెప్పారు. ఆటోనగర్‌కు చెందిన షేక్ ముజీబ్ అహ్మద్, షేక్ నదీం, షేక్ జునైద్, షేక్ రెహాన్‌లను అరెస్టు చేసి, వారి నుంచి ఐదు ఫోన్లు, రూ.50 వేల నగదు, క్రెడిట్ కార్డులు స్వాధీనం చేసుకున్నామని వివరించారు. ఈ ముఠాకు చెందిన సాలూరవాసి షకీల్, ఆటోనగర్‌కు చెందిన షేక్ నజీబ్, మహారాష్ట్ర వాసి సచిన్, ఆరెంజ్ ట్రావెల్స్‌లో పనిచేసే రమేశ్ పరారీలో ఉన్నారని సీపీ తెలిపారు. మరోవైపు, ఆర్మూర్‌లోనూ బెట్టింగ్ నిర్వహిస్తున్న ముఠాను సైతం అరెస్టు చేసినట్టు కమిషనర్ తెలిపారు. మహారాష్ట్ర, హర్యానా రాష్ట్రాలకు చెందిన వారితో సంబంధాలు పెట్టుకుని ఇక్కడ జోరుగా ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్న గట్టడివడ్డ గౌతమ్, దయాల్ సునీల్, జాజు రంజిత్‌ను అరెస్టు చేశామని, వారు కుదువ పెట్టుకున్న 34 బైక్‌లు, 4 ఫోన్లు, రూ.6 వేల నగదు స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. హర్యాణాకు చెందిన విపుల్‌మంగ్, మహారాష్ట్ర వాసి బంటు పలాస్, ఆర్మూర్‌కు చెందిన గట్టడి శ్రీకాంత్, బబ్లూ ఠాకూర్, వినాయక్ ఠాకూర్ పరారీలో ఉన్నారని చెప్పారు.

కరీంనగర్‌లో సుడా చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న జిల్లా జేఏసీ నాయకులు

సానుకూలంగా స్పందించకుంటే నిరసనలే

- ప్రజా ప్రతినిధులకు టీఎన్జీవోల అల్టిమేటం

కొత్తపల్లి, ఏప్రిల్ 4 : ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించకుంటే నిరసనలు, ఆందోళనలు తప్పవని టీఎన్జీవో నాయకులు ప్రజా ప్రతినిధులకు అల్టిమేటం జారీ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలనే డిమాండ్‌తో శుక్రవారం ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాలు అందజేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు కరీంనగర్ జిల్లా జేఏసీ నాయకులు స్థానిక జడ్పీ కార్యాలయంలోని సుడా ఆఫీసులో చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డిని కలిసి ఉద్యోగుల సమస్యలపై వినతిపత్రం ఇచ్చారు. ప్రజలను, ప్రజా ప్రతినిధులను కడుపులో పెట్టుకొని కంటికి రెప్పలా కాపాడుకునేది ప్రభుత్వ ఉద్యోగులేనన్నారు. ఉద్యోగులకు జీత భత్యాలు, పెండింగ్ బిల్లులు, ఐదు డీఏలు, పీఆర్సీ, హెల్త్ కార్డులు, జీతాలను ఈ-కుబేర్ ద్వారా కాకుండా జిల్లా ట్రెజరీల ద్వారా ఇప్పించాలని కోరారు.

వర్సిటీలు పునరావాస కేంద్రాలుగా మారొద్దు

- ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ వర్సిటీలను తీర్చిదిద్దాలి
- కేకేకు సమస్యలు తీర్చే బాధ్యతలు: సీఎం

హైదరాబాద్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని యూనివర్సిటీలను కొందరు ప్రొఫెసర్లకు పునరావాస కేంద్రాలుగా మార్చొద్దని సీఎం రేవంత్‌రెడ్డి వైస్‌చాన్స్‌లర్లకు సూచించారు. డబ్బున్న వారంతా ప్రైవేట్ విశ్వవిద్యాలయాల వైపు వెళ్లిపోతున్నారని, అందువల్ల ప్రభుత్వ వర్సిటీలు ప్రైవేట్‌తో పోటీపడాలని అన్నారు. విద్యార్థి కేంద్రంగా వర్సిటీలు పనిచేయాలని చెప్పారు. బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో శుక్రవారం సీఎం యూనివర్సిటీలపై సమీక్షించారు. పెద్దగా ప్రాధాన్యంలేని కోర్సులను రద్దుచేసి, కొత్త కోర్సులను ప్రవేశపెట్టాలని చెప్పారు. యూనివర్సిటీ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కే కేశవరావుతో సమావేశం కావాలని సూచించారు. అనంతరం వర్సిటీల వారీగా చర్యలపై నివేదిక రూపొందించి సమర్పించాలని అన్నారు.

'మెరుగైన విద్యకు ప్రణాళికలు సిద్ధం చేయండి'

రాష్ట్రంలో మెరుగైన విద్యా వ్యవస్థ రూపకల్పనకు సమగ్ర విధాన పత్రం రూపొందించాలని సీఎం రేవంత్‌రెడ్డి విద్యాకమిషన్‌ను ఆదేశించారు. ఉత్తమ విద్యావ్యవస్థ కోసం ఎంత ఖర్చయినా వెనుకాడబోమని చెప్పారు. అంగన్‌వాడీలు, పాఠశాలల్లో తీసుకురావాల్సిన మార్పులపై అన్ని వర్గాలతో చర్చించి విధానపత్రాన్ని తయారుచేయాలని సూచించారు. ఫౌండేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ ప్రధానకార్యదర్శి డాక్టర్ జయప్రకాశ్ నారాయణ, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు కే కేశవరావు, శ్రీనివాసరాజు, సీఎంవో కార్యదర్శి మాణిక్‌రాజ్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాస్, విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితారాణా, విద్యాకమిషన్ చైర్మన్ ఆకునూరు మురళి, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డిలు పాల్గొన్నారు.

7న చలో గిరిజన సంక్షేమ భవన్

- 219 కోట్ల పెండింగ్ రుణాలివ్వాలి
- గిరిజన జేఏసీ డిమాండ్

హైదరాబాద్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ): గిరిజన యువతకు రావాల్సిన రూ.219 కోట్ల ట్రైకార్ రుణాలను వెంటనే విడుదల చేయాలని గిరిజన సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. నిధుల విడుదల కోసం 7న చలో గిరిజన సంక్షేమ భవన్ ముట్టడి కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు వెల్లడించింది. ఈ మేరకు తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ధర్మనాయక్, శ్రీరాంనాయక్, తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ నాయక్ ప్రకటన విడుదల చేశారు. 'గత బీఆర్ఎస్ ప్రభుత్వం ట్రైకార్ సంస్థ ద్వారా 2019-2021 సంవత్సరాల్లో సబ్సీడీ రుణాల మంజూరుకు గిరిజన యువత నుంచి దరఖాస్తులు స్వీకరించింది. 30 వేల మందిని లబ్ధిదారులుగా గుర్తించింది. వీరికి రుణాలు అందించడం కోసం రూ.219 కోట్ల చెక్కులను సిద్ధం చేసి క్లియరెన్స్ కోసం ఆర్థిక శాఖకు పంపింది. కాంగ్రెస్ సైతం అధికారంలోకి రాగానే ఆ నిధులను మంజూరు చేస్తామని హామీ ఇచ్చింది. కానీ ఇప్పటికీ రూ.219 కోట్లను విడుదల చేయలేదు. ఇదే సమయంలో రాజీవ్ యువ వికాసం పథకం కింద గిరిజనులు మళ్లీ దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించలేదు. దీంతో గిరిజన యువతకు తీవ్ర నష్టం జరుగుతున్నది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం రూ.219 కోట్లను విడుదల చేయాలి. లేదంటే ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తాం' అని గిరిజన నాయకులు హెచ్చరించారు.

బీసీల రిజర్వేషన్ల కోసం ధర్మయుద్ధం

- 42% అమలు చేస్తరా.. దిగిపోతరా?
- బీసీ జనసభ అధ్యక్షుడు రాజారాం
- మే 23న బీసీల ధర్మ యుద్ధభేరి

హైదరాబాద్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ): బీసీలకు రిజర్వేషన్ల పెంపుపై సీఎం రేవంత్‌రెడ్డి డ్రామాలకు తెరతీశారని బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాంయాదవ్ విమర్శించారు. విద్య, ఉద్యోగ, ఉపాధి కల్పన, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్‌ను 42 శాతానికి పెంచుతున్నామని చెప్తూ అసెంబ్లీలో బిల్లును ఆమోదించిన ప్రభుత్వం వెంటనే గవర్నర్‌కి పంపి ఆమోదం తీసుకోవాల్సి ఉందని చెప్పారు. ఆ తర్వాత జీవోలు జారీ చేసి అమలులోకి తీసుకురావాలని తెలిపారు. కానీ సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం రాజ్యాంగ సవరణ, 9వ షెడ్యూల్ పేరిట నాటకాలకు తెరతీశారని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో బీసీలకు రిజర్వేషన్ల పెంపు డిమాండ్‌తో మే 23న బీసీల ధర్మయుద్ధభేరి సభ నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రేవంత్ రెడ్డి బీసీలకు రిజర్వేషన్ల పెంపును అమలు చేస్తారా? లేకపోతే సీఎం పదవి నుంచి దిగిపోతారా? తేల్చుకోవాలని హెచ్చరించారు. బీసీలను మోసం చేయాలని చూస్తే రాజకీయంగా కాంగ్రెస్‌ను ఖతం చేస్తామని తేల్చిచెప్పారు.

కుల బహిష్కరణపై బీసీ కమిషన్ సీరియస్

హైదరాబాద్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ): హన్మకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలో పలువురు మత్స్యకార కుటుంబాలను కుల బహిష్కరణ చేసిన అంశాన్ని రాష్ట్ర బీసీ కమిషన్ సీరియస్‌గా తీసుకున్నది. ఘటనపై పూర్తిస్తాయిలో విచారణ జరపాలని కలెక్టర్ ప్రావీణ్యకు బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ ఆదేశాలు జారీ చేశారు. మత్స్య సహకార సంఘంలో అవకతవకలు జరిగాయని పలు మత్స్యకార కుటుంబాలు నిలదీయగా, వారిని కుల బహిష్కరణ చేశారు. దీనిపై బీసీ కమిషన్ స్పందించింది.

బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా గౌతమ్‌రావు

హైదరాబాద్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ స్థానిక సంస్థల బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎన్ గౌతమ్‌రావును పార్టీ హైకమాండ్ ప్రకటించింది. బీజేపీ నుంచి ఎమ్మెల్సీగా ఉన్న ప్రభాకర్ పదవీకాలం మే 1న ముగియనున్నది. దీంతో ఈ స్థానానికి ఏప్రిల్ 23న పోలింగ్, 25న ఓట్ల లెక్కింపు జరుగనున్నది. గౌతమ్‌రావు గతంలో హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. హైదరాబాద్ జిల్లాలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ఎన్నికైన కార్పొరేటర్లు ఈ ఎన్నికల్లో ఓటు వేయడానికి అర్హులు. 81 మంది కార్పొరేటర్లు, 35 మంది ఎక్స్ అఫిషియో సభ్యులు సహా మొత్తం 116 మంది ఓటర్లు ఉన్నారు. మరోవైపు ఎమ్మెల్సీ అభ్యర్థిగా గౌతమ్‌రావును ప్రకటించడంపై ఆ పార్టీ గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మీ పార్లమెంట్ నియోజకవర్గానికే పోస్టులు ఇస్తారా?. మీకు గులాంగిరి చేసే వారికి మాత్రమే పోస్టులు, టికెట్లు కేటాయిస్తున్నారు' అని పరోక్షంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

రూ.93 వేల దిగువకు పుత్తడి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4: గత కొన్ని రోజులుగా రికార్డు స్థాయిలో దూసుకుపోయిన బంగారం ధరలు దిగొచ్చాయి. ఐదు రోజులుగా పెరుగుతూ వచ్చిన పుత్తడి ధర శుక్రవారం రూ.93 వేల స్థాయికి దిగొచ్చింది. అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ పడిపోవడంతో ఢిల్లీ బులియన్ మార్కెట్లో పదిగ్రాముల బంగారం ధర రూ.1,350 తగ్గి రూ.93 వేలకు దిగొచ్చిందని ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ తాజాగా వెల్లడించింది. గురువారం రికార్డు స్థాయికి చేరుకున్న ధరల ఆ మరుసటి రోజే భారీగా తగ్గడం విశేషం. డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య యుద్ధానికి తెరలేపడంతో పెట్టుబడిదారులు తమ ఇన్వెస్ట్‌మెంట్లను సురక్షితమైన పుత్తడి నుంచి ఈక్విటీలవైపు మళ్లించడంతో తగ్గుముఖం పట్టాయని బులియన్ వర్తకులు వెల్లడించారు. బంగారంతోపాటు వెండి భారీగా తగ్గింది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు నిలిచిపోవడంతో కిలో వెండి ఏకంగా రూ.5,000 తగ్గి రూ.95,500కి దిగొచ్చింది. గడిచిన నాలుగు నెలల్లో ఒక్కరోజు ఇంతటి స్థాయిలో పతనం చెందడం ఇదే తొలిసారి కావడం విశేషం. బంగారం ధరలు వారం కనిష్ఠ స్థాయి, వెండి ఐదు వారాల కనిష్ఠ స్థాయికి జారుకున్నట్లు మెహతా ఈక్విటీస్ వైస్ ప్రెసిడెంట్ రాహుల్ కలాంత్రి తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 21.74 డాలర్లు తగ్గి 3,093.60 డాలర్లకు పడిపోగా, వెండి 31.32 డాలర్లకు పరిమితమైంది.

రూ.10 లక్షల కోట్ల సంపద ఆవిరి

ముంబై, ఏప్రిల్ 4: దేశీయ ఈక్విటీ మార్కెట్ల నష్టాల పరంపర కొనసాగుతున్నది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య యుద్ధానికి తెరలేపడంతో అంతర్జాతీయంగా స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒత్తిడికి గురయ్యాయి. మరోసారి ఆర్థిక మాంద్యం గుప్పిట్లోకి అగ్రరాజ్యం అమెరికా వెళ్తున్నదంటూ వచ్చిన వార్తలు మదుపరుల్లో ఆందోళనను పెంచింది. దీంతో అమ్మకాలకు మొగ్గుచూపడంతో సెన్సెక్స్ 76 వేల దిగువకు పడిపోయింది. బ్లూచిప్ సంస్థల కరెక్షన్‌కు గురికావడంతో 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ వెయ్యి పాయింట్ల వరకు నష్టపోయింది. ఇంట్రాడేలో 1,055 పాయింట్లు నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 930.67 పాయింట్లు లేదా 1.22 శాతం నష్టపోయి 75,364.69 పాయింట్ల వద్ద ముగిసింది. మరోసూచీ నిఫ్టీ 345.65 పాయింట్లు(1.49 శాతం) కోల్పోయి 22,904.45 వద్ద స్థిరపడింది. సూచీలు ఒక్క శాతం వరకు నష్టపోవడంతో మదుపరులు రూ.10 లక్షల కోట్ల సంపదను కోల్పోయారు. దీంతో బీఎస్ఈలో లిస్టైన కంపెనీల విలువ రూ.9,98,379.46 కోట్లు కరిగిపోయి రూ.4,03,34,886.46 కోట్లకు జారుకున్నది.

ఫార్మా షేర్లకు టారిఫ్‌ల సెగ

త్వరలో దేశీయ ఫార్మా ఉత్పత్తులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌లను విధించబోతున్నట్టు ప్రకటించడంతో ఈ రంగ షేర్లు కుప్పకూలాయి. అత్యధికంగా 11 శాతం మేర నష్టపోయాయి. మర్కాసన్స్ ఫార్మా షేరు అత్యధికంగా 11.18 శాతం నష్టపోగా..లారస్ ల్యాబ్స్ 7.40 శాతం, శిల్పా మెడికేర్ 6.56 శాతం, ఇప్కా ల్యాబ్స్ 6.53 శాతం, అరబిందో ఫార్మా 5.96 శాతం, లుపిన్ 5.85 శాతం, గ్లాండ్ ఫార్మా 5.51 శాతం, అజంతా ఫార్మా 5.40 శాతం, సిప్లా 5.32 శాతం, బయోకాన్ 5.09 శాతం, దివీస్ ల్యాబ్ 4.70 శాతం, డాక్టర్ రెడ్డీస్ 3.60 శాతం, సన్ ఫార్మా 3.43 శాతం పతనం చెందాయి.

- టాటా స్టీల్ 8.59 శాతం నష్టపోయి టాప్ లూజర్‌గా నిలిచింది.
- దీంతోపాటు టాటా మోటర్స్, లార్సెన్ అండ్ టుబ్రో, అదానీ పోర్ట్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, టెక్ మహీంద్రా, రిలయన్స్, సన్ ఫార్మా, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, టీసీఎస్‌లు నష్టపోయాయి.
- మరోవైపు, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, నెస్లె, ఐసీఐసీఐ బ్యాంక్, ఐటీసీ, ఏషియన్ పెయింట్స్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు లాభాల్లో ముగిశాయి.

వాణిజ్య

గ్రోక్ నోటా అదే మాట

భారత్‌పై ట్రంప్ టారిఫ్‌లను నిలువరించడంలో మోదీ విఫలం • నెటిజన్ల ప్రశ్నలకు ఏఐ చాట్‌బాట్ గ్రోక్ సమాధానం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ): భారత్‌పై ప్రతీకార సుంకాలు విధిస్తామంటూ అధికార పగ్గాలు చేపట్టగానే ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నంత పనీ చేశారు. భారత్ ఉత్పత్తులపై 27 శాతం సుంకాలు విధిస్తున్నట్టు తాజాగా ప్రకటించారు. టారిఫ్‌ల విషయంలో అమెరికాతో ప్రధాని మోదీ దౌత్యం ఫెయిల్ అయ్యిందని, అందుకనే భారత్‌పై అమెరికా సుంకాల మోత మోగించిందని సర్వత్రా చర్చ జరుగుతున్నది. ఇదే విషయమై ఏఐ చాట్‌బాట్ 'గ్రోక్'ను ప్రశ్నించగా దాదాపుగా ఇవే సమాధానాలు వచ్చాయి. భారత్‌పై సుంకాలు విధించకుండా ట్రంప్‌ను నిలువరించడంలో ప్రధాని మోదీ ఫెయిల్ అయ్యారా? అంటూ ఓ నెటిజన్ 'గ్రోక్'ను ప్రశ్నించగా.. భారత్‌పై అమెరికా సుంకాలను పూర్తిగా నివారించలేకపోవడం ప్రధాని మోదీ వైఫల్యంగానే చూడవచ్చని గ్రోక్ వివరించింది. యూఎస్-ఇండియా మధ్య వాణిజ్య ఉద్రిక్తతలను తగ్గించడానికి అమెరికా నుంచి దిగుమతి అయ్యే హై-ఎండ్ మోటార్ సైకిల్స్‌పై 20 శాతం మేర, బోర్బన్ విస్కీ టారిఫ్‌లను 50 శాతం మేర భారత్ తగ్గించిందన్న గ్రోక్ ఈ అంశంలోనే ఫిబ్రవరిలో మోదీ స్వయంగా ట్రంప్‌తో భేటీ అయినట్టు గుర్తు చేసింది. ఇతర టారిఫ్‌లను సమీక్షించడంతో పాటు రక్షణ పరికరాలను అగ్రరాజ్యం నుంచి కొనుగోలు చేస్తామని మోదీ ఈ సందర్భంగానే హామీనిచ్చినట్టు తెలిపింది. అయినప్పటికీ టారిఫ్‌ల విషయంలో వెనక్కి తగ్గని ట్రంప్ భారత్ ఉత్పత్తులపై 27 శాతం సుంకాలు విధిస్తున్నట్టు ప్రకటించారని తెలిపింది. దీంతో సుంకాల విషయంలో అమెరికాతో ప్రధాని మోదీ దౌత్యం విఫలం అయ్యిందని, ట్రంప్‌ను మోదీ వ్యక్తిగతంగా వెళ్లి కలిసినప్పటికీ ఫలితం ఏమీ దక్కలేదని గ్రోక్ విశ్లేషించింది.

స్నేహం కూడా పనిచేయలేదు

మోదీ, ట్రంప్ స్నేహంగా ఉన్నప్పటికీ, భారత్‌పై అమెరికా 27 శాతం సుంకాలు ఎందుకు విధించింది? అంటూ మరో నెటిజన్ గ్రోక్‌ను ప్రశ్నించాడు. దీనికి స్పందిస్తూ.. మోదీకి ట్రంప్ మిత్రుడైనప్పటికీ, 'హౌడీ మోదీ', 'నమస్తే ట్రంప్' వంటి ఈవెంట్లలో ఇరు దేశాధినేతలు పాల్గొన్నప్పటికీ సుంకాల విషయంలో ఇవేమీ పని చేయలేదని 'గ్రోక్' తేల్చి చెప్పింది. 'అమెరికాను మళ్లీ గొప్పగా చేయాల'న్న ట్రంప్ రాజకీయ ఎజెండానే దీనికి కారణంగా వివరించింది. అమెరికా సుంకాల వాతపై ప్రధాని మోదీ మౌనంవహించడంపై 'గ్రోక్'ను ఓ నెటిజన్ ప్రశ్నించగా.. మోదీ మౌనంపై ప్రతిపక్షాలు కూడా విమర్శలు చేస్తున్నాయని గుర్తు చేసింది. ట్రంప్ ఒత్తిడికి మోదీ తలవంచారంటూ విపక్ష పార్టీ నేతలు మండిపడుతున్నారని గ్రోక్ విశ్లేషించింది.



ఈ ఇంటికి ఆ ఇల్లు ఎంత దూరమో.. ఆ ఇంటికి ఈ ఇల్లూ అంతే అన్నట్టు అమెరికాతో ప్రపంచ దేశాలు నడుచుకుంటున్నాయి.

అగ్రరాజ్యం అధ్యక్షుడు ప్రతీకార సుంకాలు ప్రకటించిన గంటల వ్యవధిలోనే చైనా గట్టిగా బదులిచ్చింది. ట్రంప్‌కు రిటర్న్ గిఫ్ట్‌ను సిద్ధం చేసి ట్రేడ్ వార్‌కు సై అన్నది.

తమపై విధించిన 34 శాతం అదనపు సుంకాలకు తగ్గట్టుగానే అమెరికా దిగుమతులపై సుంకాలు వేస్తామని స్పష్టం చేసింది. ఈ నెల 10 నుంచే మొదలు.

ఢీ అంటే ఢీ

అమెరికాకు చైనా ఝలక్ • దీటుగా ప్రతీకార సుంకాలు • 34% టారిఫ్‌లు వేస్తామన్న డ్రాగన్

ఈ నెల 10 నుంచే మొదలు • మరికొన్ని దేశాలూ అదే బాటలో? • ముదురుతున్న వాణిజ్య యుద్ధం



- వాణిజ్య భాగస్వామ్య దేశాలపై అమెరికా ప్రతీకార సుంకాలను సవాల్ చేస్తూ ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో)లో చైనా దావా.
- భారత్, అమెరికాల నుంచి అవుతున్న మెడికల్ సీటీ ట్యూబ్ దిగుమతుల్లో యాంటీ డంపింగ్ దర్యాప్తునకు దిగిన చైనా.
- అమెరికా రక్షణ, కంప్యూటర్, స్మార్ట్‌ఫోన్ పరిశ్రమల్ని దె